సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నవ్వు ఆరోగ్యానికి ప్రయోజనకారి



కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి తదితరులు

మల్కాపురం: నవ్వు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని.. అందుకే ఎల్లప్పుడూ సంతోషంగా నవ్వుతూ బతకడం అలవాటు చేసుకోవాలని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడుతూ నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని,ఆరోగ్య సమస్యలు మాయం అవుతాయన్నారు.ఒక్క చిరునవ్వుతో స్నేహ బంధం ఎంతో బలపడుతుందన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు హాస్య కథలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్,ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ జి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

యువకుడి దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

మల్కాపురం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా... శివమణి ప్రకాష్ (40) అనే వ్యక్తి మల్కాపురం సమీపాన గల త్రినాథపురంలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. కాంట్రాక్ట్ పనులు చేస్తు జీవనం సాగిస్తున్నాడు.అయితే సొంత పనుల నిమిత్తం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై మల్కాపురం సేవా మార్గంలో గాజువాక వైపు వెళ్తున్నాడు.మార్గ మధ్యలో ఆర్‌కేపురం పాత పెట్రోల్ బంక్ సమీపాన సేవా మార్గం వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ప్రకాష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారించారు.అక్కడ గల సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగా ప్రకాష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన వాహనాన్ని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: పాతనగరంలో రౌడీషీటర్లకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రజా శాంతికి భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని రౌడీషీటర్లను హెచ్చరించారు.





రిజర్వాయర్ పైభాగంలో మూతలేని దృశ్యం



గాజువాక ఆర్టీసీ డిపో వద్ద 900 కేఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్

పంప్ ఆపరేటింగ్ రూమ్

రిజర్వాయర్ వద్ద రక్షణ ఏదీ?

ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా మేల్కోరా..



రిజర్వాయర్‌కు వచ్చే ముఖ ద్వారం వద్ద సెక్యూరిటీ లేని దృశ్యం



అపరిశుభ్రంగా రిజర్వాయర్ పరిసరాలు

మల్కాపురం: వేలాది **మందికి తాగునీటిని అందించే జలాశయాల నిర్వహణలో జీవీఎంసీ నీటిసరఫరా విభాగం అధికారులు అలసత్వం ప్రదర్శిస్తు**న్నారు. కొంత మంది నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మొన్నటికి మొన్న గాజువాక ప్రాంతంలో మంచినీటి రిజర్వాయర్ ట్యాంకుకు మూత అమర్చకపోవడంతో చిన్నారులు ఈతకు దిగిన ఘటన మరవక ముందే.. పశ్చిమ నియోజకవర్గం**లో ట్యాంకు మూత లేకపోవడంతో మతిస్థిమితం లేని వ్యక్తి ప్రాణాలు పోగొట్టుకున్న విషయం విధి**తమే.. అయినా సంబంధిత అధికారుల్లో చలనం లేదు.

ఇదీ పరిస్థితి

59వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో ఎదురుగా గల పాత చెక్‌పోస్టు ఏరియా వద్ద 900 కేఎల్ సామర్థ్యం గల భారీ రిజర్వాయర్ పనులు **సుమారు రూ.3 కోట్ల వ్యయంతో కొంత కాలం నుంచి జరుగుతున్నాయి.పారిశ్రామిక ప్రాంత** వాసులకు 24 గంటలు నీటిని సరఫరా చేయాలనే ఆలోచనతో అధికారులు ఈ నిర్మాణ పనులు చేపడుతున్నారు. రిజర్వాయర్ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. ఇంకా పైపులైన్ పనులు జరగాల్సి ఉంది. అయితే ఈ రిజర్వాయర్ ఎలా పని చేస్తుంది అని పరీక్షిస్తున్నారు. వాటర్ లీకులు **ఏమైనా ఉంటే వెంటనే మరమ్మతులు చేపడతారు. ఇంత వరకు బాగానే ఉన్నా రిజర్వాయర్ వాటర్** టెస్టింగ్ అనంతరం పైకప్పులు అమర్చాలి.రిజర్వాయర్ పై నీటిని నింపేదుకు మూడు మ్యాన్‌హోల్స్ ఉన్నా ఒక్క దానిపై కూడా మూతలు ఆశ్చర్యకరం . రిజర్వాయర్‌కు సమీపంలో కొంత మంది ఆకతాయిలు రాత్రి వేళల్లో మద్యం సేవించడం,ధూమపానం వంటివి చేస్తుంటారు.అలాంటి వారు **రాకుండా ఇక్కడ సెక్యూరిటీ** ఉండాలి.కానీ **సెక్యూరిటీ లేరు.దీంతో ఇక్కడ** పలు సమస్యలు **ఏర్పడుతున్నాయి. శనివారం** సాయంత్రం రిజర్వాయర్ పైకిఎక్కి టెస్టింగ్ కోసం పెట్టిన నీటిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అధికారులు స్పందించి సెక్యూరిటీని ఏర్పాటు చేయడంతో పాటు పై కప్పులను అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాత గోపాలపట్నంలో కార్డన్ సెర్చ్



పాతగోపాలపట్నంలోని ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



వాహన పత్రాలు పరిశీలిస్తున్న పోలీసులు

- మూడు వాహనాలు సీజ్
- నంబర్ ప్లేట్లు లేని ఐదు వాహనాలకు ఫైన్లు

గోపాలపట్నం: గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాతగోపాలపట్నంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు వీధుల్లోని ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. అనుమానితులపై ఆరా తీశారు. వాహనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ గొలగాని అప్పారావు మాట్లాడుతూ నగరంలో నేరాలు అరికట్టడడంతో పాటు ప్రజలను అప్రమత్తం చేయడానికి కార్డన్ సెర్చ్ చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఎటువంటి ఆధారాలు.. వివరాలు తెలియకుండా ఎవరికీ అద్దెకు ఇల్లు ఇవ్వవద్దని సూచించారు. నేరాల నియంత్రణకు పోలీసులతో సహకరించాలని అన్నారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌ల్లో తప్పనిసరిగా వాచ్‌మెన్లతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చైన్‌స్నాచింగ్‌లపై మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటికి తాళాలు వేసి దూర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించాలని సూచించారు. పత్రాలు లేని 3 వాహనాలను సీజ్‌చేశారు. నంబర్ ప్లేట్లు లేని 5 వాహనాలకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి



స్కూల్ యూనిఫాంలో సెయింట్ పీటర్స్ పూర్వ విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ బాలుర ఉన్నత పాఠశాలలో 2000–01 సంవత్సరానికి చెందిన టెన్త్ విద్యార్థులు ఆదివారం భీమిలిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఉత్సాహంగా గడిపి పాత అనుభూతులను పంచుకున్నారు. 25 ఏళ్ల సిల్వర్ జూబ్లీ వేడుకల్లో తమ పాఠశాలలో చిన్ననాటి సంఘటనలు, జ్ఞాపకాలు పంచుకున్నారు. పాఠశాల లోగోతో కూడిన యూనిఫాం ధరించి ఆనందం వ్యక్తం చేశారు. తమ జీవితాలను మార్చిన ఉపాధ్యాయులకు ఎంతో రుణపడి ఉంటామని తెలిపారు.

పూడికలు తొలగించరూ!



జీవీఎంసీ 63వ వార్డు పరిధి మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి చింతల్లోవ వెళ్లే మార్గంలో ఎంఈఎస్ వద్ద కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. కాంక్రీట్ దిమ్మల వల్ల నిత్యం కాలువ జామ్ అయ్యి మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తుంది. వార్డులో నాలుగు గ్రామాల నుంచి వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీరు జామ్ అయి నీరు పోలీస్‌స్టేషన్‌తో పరిసర ఇళ్లలోకి పోటెత్తుతోంది. ఇక్కడ వేసిన కాంక్రీట్ దిమ్మలు తొలగించకపోతే సమస్య కొనసాగుతూనే ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. అయితే ఎంఈ స్ అధికారులు కాంక్రీట్ దిమ్మలను తొలగించడానికి అనుమతి నిరాకరించడంతో నిత్యం ఈ సమస్య ఏర్పడుతుందని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

–సింధియా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న రాగం కిషోర్

కంచరపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైజాగ్ సీ–పోర్ట్ వైస్ చైర్మన్, పినాకిల్ ఎండీ రాగం కిషోర్ పేర్కొన్నారు. జ్ఞానాపురం పరిధిలో రంజిత్ కుమార్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత డాక్టర్ దాసరి బుజ్జి నేతృత్వంలో ఆదివారం మొక్కల పంపిణీ కార్యాక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి ఒక్కరికి ఒక మొక్క అనే నినాదంతో మొక్కలు అందజేశారు. ముందుగా చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మహిళలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రాపాక యాదవ్, కొయిలాడ శ్రీనివాసరావు, సుభాషిణి, పద్మ, భవిత, ఉమా, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంతో అవస్థలు



జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరం సమీపంలో వీధిలైట్లు వెలగడం లేదు. చీకట్లో సంచరించలేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు చీకటి పడితే విషకీటకాల సంచారం అధికంగా ఉంటుందని, ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాముల సంచారం కూడా అధికమైందన్నారు. దీంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పలు మార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

–సింధియా

ఉక్కు పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు



మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ఐక్య ఉద్యమాలు అవసరమని కార్పొరేటర్ గంగారావు అన్నారు. సీపీఎం స్టీల్ డివిజన్, స్టీల్ సీఐటియు, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆదివారం మేడే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ ప్లాంట్‌లో కార్మికులు సంతోషంగా పని చేయాలంటే ఇంటి వద్ద భార్య, పిల్లు సంతోషంగా ఉండాలన్నారు. అలా ఉండాలంటే మహిళలు, పిల్లలు ఆట,పాటలతో సంతోషంగా గడపాలన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఎదుర్కొవాలంటే మహిళలు ఉద్యమంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ కె. విమల మాట్లాడుతూ మహిళలు మద్దతుతోనే ఏ ఉద్యమమైనా విజయవంతం అవుతుందన్నారు. దాని కోసం మనం అందరం కార్మికులతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు. రామస్వామి, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గుర్రం రమణ, ఐద్వా నాయకులు కె. వేణు, ఎం.వి.ఎస్. మూర్తి, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

దాబాగార్డెన్స్: అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు వస్తే సంఘం పెట్టుకునే హక్కు పోతుందన్నారు. చెన్నైలోని సామ్‌సంగ్ కంపెనీలో కార్మికులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న యూనియన్‌ను రిజిస్టర్ చేయకుండా యాజమాన్యం, ప్రభుత్వం అడ్డుకున్నాయన్నారు. లేబర్‌కోడ్ అమల్లోకి వస్తే కార్మికులు ఏ కష్టం వచ్చినా సమస్య పరిష్కారానికి సమ్మె చేయలేరని, అలా చేస్తే ఒక రోజు సమ్మెకు 8 రోజుల వేతనం కోల్పోతారన్నారు. నాయకులను జైల్లో పెట్టి నిర్బంధించవచ్చని, యూనియన్ రిజిస్ట్రేషన్, గుర్తింపు రద్దు చేయవచ్చని, లక్షలాది రూపాయల జరిమానా విధించవచ్చన్నారు. మరోవైపు ఇప్పటి వరకు కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చెల్లించని యజమానులకు జైలు శిక్ష పడేదని, దానికి భయపడి కట్టేవారన్నారు. యజమానులు జైలుకెళ్తే బెయిల్ రావాలంటే 50 శాతం చెల్లించాల్సి ఉండేదన్నారు. కానీ లేబర్ కోడ్‌లో యజమానుకు ఈ శిక్షలు ఎత్తివేశారన్నారు. కార్మికుల పాలిట శాపంగా మారే లేబర్‌కోడ్ల రద్దుకు పోరుబాట పట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రమణబాబు, సురేష్, హెచ్‌ఎంఎస్ నాయకుడు మంగయ్య నాయుడు, సిటు గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, త్రినాథరావు, వీడీఎల్‌బీ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మణరావు, సీఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు కనకారావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు బి. వెంకట్రావు, సిటు కార్యదర్శి బి. జగన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ డీఐటీయూ ప్రధానకార్యదర్శి డేవిడ్‌కు సత్కారం



డేవిడ్ దంపతులను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జీఎం, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డీఐటీయూ ప్రధాన కార్యదర్శి బి. డేవిడ్‌ను ఘనంగా సత్కరించారు. డేవిడ్ ఇటీవల పదవీ విరమణ చేసిన సందర్భంగా డీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డేవిడ్ దంపతులను ఉక్కు అధికారులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎం. మధుసూదనరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆయన సేవలను ప్రశంసించారు. వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, పి.వి. రమణమూర్తి, గంధం వెంకటరావు, దొమ్మేటి అప్పారావు, శశిభూషణరావు, రామ్మోహన్‌కుమార్, జగదీష్, నమ్మి సింహాద్రి, బయ్యే మల్లయ్య, అప్పారావు పాల్గొన్నారు.

నూకాంబిక..చల్లగ చూడమ్మా



కలశాలను ఊరేగిస్తున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని కొత్త కర్నవానిపాలెం గ్రామ దేవత నూకాంబిక అమ్మవారి పండగను పురస్కరించుకొని ఆదివారం కలశాలను ఊరేగించారు. కొత్త కర్నవాపాలెం గ్రామం నుంచి సమతానగర్ మీదుగా నడుపూరు వరకూ పెద్ద సంఖ్యలో మహిళలు కలశాలను ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ఆ నీటితో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై శిక్షణ



శిక్షణకు హాజరైన గురుకుల ఉపాధ్యాయులు

సీతంపేట: ఆంగ్ల ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపొందించే దిశగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం శంకరమఠం రోడ్డులోని ఒక హోటల్‌లో ప్రారంభించింది. ఈ సందర్భంగా సొసైటీ డీసీవో డాక్టర్ సి.ప్రభావతమ్మ మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ బోధనా సామర్థ్యం మెరుగుపర్చడానికి ముంబైకి చెందిన కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్‌తో ఎంవోయూ చేసుకున్నట్టు తెలిపారు. కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఫ్యూచర్ రెడీనెస్ అంశంపై మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గురుకుల ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, కోటక్ ఫౌండేషన్ ప్రతినిధులు నూథన్, ఫర్షిత్ పంతక్, జ్యోతి శిక్షణ ఇచ్చారు.